క్లుప్తంగా

వైభవంగా రథోత్సవం


రథం లాగుతున్న భక్తులు

గూడూరు: పట్టణంలో వెలసిన తిమ్మగురుడు స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రారంభ రథోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాల మధ్య రథంపై కొలువుదీర్చారు. అనంతరం భక్తుల జయ జయధ్వానాల నడుమ రథాన్ని భక్తులు 5 అడుగుల దూరం లాగారు. శనివారం సంపూర్ణ రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈఓ గెర్రెడ్డి తెలిపారు.

వలంటీర్ల రాజీనామా


ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు

కల్లూరు: మండలంలోని బస్తిపాడు, చిన్నకొట్టాల గ్రామాలకు చెందిన 16 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి బిందు భార్గవిలకు శుక్రవారం రాజీనామా పత్రాలను సమర్పించారు. ఎవరి ప్రోద్బలం, ప్రోత్సాహంతో రాజీనామాలు చేయడం లేదని, స్వచ్ఛందంగా చేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ. 10వేలు ఇస్తామన్న హామీపై తమకు నమ్మకం లేదన్నారు.

నేడు కోడుమూరులో వైఎస్సార్‌సీపీ ప్రచారం

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి శనివారం కోడుమూరులో ఎన్నికల ప్రచారం చేస్తారని జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

జోరుగా ఎన్నికల ప్రచారం


సి.బెళగల్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సి.బెళగల్: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి మరోసారి సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్‌ను గెలిపించాలని కోరారు. జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, నాయకులు వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, రఘురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసే వారికి పట్టం కట్టాలి


32వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసులు

కల్లూరు: వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు ఎంతో మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో ఆశీర్వదించాలని కల్లూరు అర్బన్ 32వ వార్డు కార్పొరేటర్ సాన శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం వార్డులో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ప్రాంతీయ ప్ర భుత్వ సర్వజన వైద్యశాల, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాల వద్ద శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. స్థానికంగా విద్యు త్ సరఫరా సమయంలో ట్రిప్ కావడంతో ఈ మూడు ప్రాంతాల్లో మధ్యా హ్నం గంట పాటు విద్యుత్ నిలిచిపోయింది.ఈ కారణంగా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కార్యకలాపాలు, కంటి ఆసుపత్రిలో రోగులకు కంటి పరీక్ష లు, వైద్యపరీక్షలు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య పరీక్షలు, చికిత్సలు నిలిచిపోయాయి. పలు వార్డుల్లో ఫ్యాన్లు తిరగక రోగులు ఇబ్బంది పడ్డారు.

పింఛన్ల పంపిణీకి తూట్లు.. పండుటాకుల పాట్లు

- బ్యాంకుల వద్ద లబ్ధిదారుల పడిగాపులు
- ఉదయం నుంచే క్యూలో అవస్థలు
- చంద్రబాబు తీరుపై మండిపడిన వృద్ధులు


పోలకల్ ఏపీజీబీ బ్యాంక్ వద్ద నగదు తీసుకోవడానికి వేచివున్న వృద్ధులు

ఓర్వకల్లు/కల్లూరు: గతంలో గ్రామ పంచాయతీల వద్ద సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ జరిగేది. ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చిందంటే ఆపసోపాలతో పంచాయతీ కార్యాలయం వద్దకు చేరి గంటల తరబడి నిరీక్షించి నగదు తీసుకునేవారు. ఈ పరిస్థితిని గమనించిన సీఎం వైఎస్ జగన్ ఇకపై అవ్వాతాతలకు, అక్కాచెల్లమ్మలకు ఆ దుస్థితి రాకూడదనే ఉద్దేశంతో అధికారంలోకి వచ్చాక వలంటీర్ల సాయంతో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ల పంపిణీ జరిగేలా నిర్ణయం తీసుకున్నారు. ఐదేళ్ల వరకు పింఛన్ల పంపిణీ సవ్యంగా సాగింది. అయితే ఈ విధానాన్ని చూసి జీర్ణించుకోలేని టీడీపీ 2024 ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందుగానే పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏప్రిల్ మాసంలో గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయించగా, మే నెలలో సామాజిక భద్రత పింఛన్లనే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 28,496 మంది లబ్ధిదారులు ఉండగా వారిలో 7,011 మంది దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి దగ్గరకే అందించారు. మిగిలిన వారు బ్యాంకుల తిరుగుతూ పడరాని పాట్లు పడుతున్నారు.


ఓర్వకల్లు: నన్నూరు ఏపీజీబీ బ్యాంకు వద్ద గుమికూడిన పింఛన్‌దారులు


కల్లూరు: చిన్నటేకూరు బ్యాంక్ వద్ద ..

–ఓర్వకల్లు మండలంలో మొత్తం 7,805 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఇందులో 1849 మంది దివ్యాంగులు, అనారోగ్యం, నిస్సహాయక స్థితిలో నడవలేని వయో వృద్ధులకు సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దే పింఛన్ అందజేస్తున్నారు. మిగతా 5,956 మందికి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. నాలుగు రోజుల నుంచి ఆయా గ్రామాల లబ్ధిదారులు బ్యాంకుల వద్దకు ఉదయాన్నే వెళ్లి పడిగాపులు కాస్తున్నారు. వ్యవప్రయాసాలకు ఓర్చుకొని నిరీక్షించినా పింఛన్ సొమ్ము రాలేదని చెప్పడంతో కొందరు నిరాశతో వెనుదిరిగారు.

–పాణ్యం: మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ పరిధిలో తమ్మరాజుపల్లె, పిన్నాపురం, కొణిదేడుతో పాటు పలు గ్రామాలు ఉన్నాయి. తమ్మరాజుపల్లె గ్రామం నుంచి పాణ్యంకు 13 కి.మీ దూరం ఉండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆటోలకు ఎక్కువ మొత్తం వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడని వాపోతున్నారు.

–కోడుమూరు రూరల్: మండలంలో ఏ బ్యాంకు వద్ద చూసినా పింఛన్ డబ్బులు తీసుకునేందుకు వచ్చిన వృద్ధులే కనిపించారు. తీరా బ్యాంకు వద్ద తమ వంతు వచ్చినా ఖాతాకు ఆధార్ లింకు లేదనో, ఖాతా పనిచేయడం లేదనో బ్యాంకు సిబ్బంది చెబుతుండడంతో కొందరు లబ్ధిదారులు తీవ్ర అసహనానికి గురవుతూ తమను ఇబ్బందుల పాలు చేస్తున్న చంద్రబాబును తిట్టుకుంటూ ఆపసోపాలు పడుతున్నారు.

–గూడూరు: పట్టణంలో బ్యాంకుల దగ్గర పెన్షన్‌దారులు పడిగాపులు కాస్తున్నారు. ఎస్‌బీఐ, ఏపీజీబీ, మీ సేవ కేంద్రాల వద్ద పింఛన్ డబ్బుల కోసం ఆధార్ కార్డులు చేత పట్టుకుని పడరాని పాట్లు పడుతున్నారు.

–సి.బెళగల్: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 7,330 మంది లబ్ధిదారులు ఉండగా డీబీటీలో 5,612 మందికి, ఇంటి వద్దే 1,718 మందికి పింఛన్ల పంపిణీకి అధికారులు చర్యలు తీసుకున్నారు. సి.బెళగల్‌లోని కెనరాబ్యాంక్‌కు చుట్టు పక్కల గ్రామాల నుంచి వృద్ధులు మూడు రోజులుగా తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 97.31 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ శకుంతల తెలిపారు.

చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది



నేను వ్యవసాయ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాను. పింఛన్ కోసం నన్నూరు బ్యాంకు వద్దకు మూడు రోజులుగా తిరుగుతున్నాను. వివరాలు సరిగా లేకపోవడంతో పింఛన్ రాలేదని వెనక్కు పంపుతున్నారు. నాలుగేళ్ల పాటు వలంటీరు ఇంటికి వచ్చి తెల్లవారకముందే పింఛన్ అందజేసేవారు. దీంతో మాకు ఏ కష్టాలు ఉండేవికాదు. సాఫీగా వ్యవసాయ పనులకు వెళ్లేవాళ్లం. ఇప్పుడు టీడీపీ నాయకులు చేసిన పనికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా లాంటి పేదవాళ్లపై కక్ష తీర్చుకోవడం మంచిది కాదు. మళ్లీ జగన్ ప్రభుత్వం వస్తేనే మా కష్టాలు తీరుతాయి.

–లక్ష్మిదేవి, వితంతురాలు, ఉప్పలపాడు, ఓర్వకల్లు

టీడీపీ కక్ష సాధింపులతోనే ఇలా..



మా ఊరి నుంచి మూడు రోజులుగా నన్నూరు బ్యాంకుకు వచ్చిపోతున్నా ను. ఎక్కువ మంది ఉండడంతో గంటల తరపడి వేచ్చి ఉండాల్సిన పరిస్థితి. అసలే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. రోజు ఇలా తిరుగుతుండడం వల్ల చాలా ఇబ్బందులు ప డుతున్నా. వలంటీర్ల ద్వారా పంపిణీ చేసుంటే ఈ కష్టాలు తప్పేవి. మాకు ఈ పరిస్థితి కల్పిస్తున్న టీడీపీ నాయకులకు మా ఉసురు తగులుతుంది. వలంటీర్లు ఇంటి వద్దకు రావాలంటే మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావాలి.

–కాశపోగు సుంకులమ్మ, పూడిచెర్ల, ఓర్వకల్లు

7 కి.మీ వెళ్లి నగదు తీసుకున్నా



మాది సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డి గ్రామం. ఈ నెల పింఛన్ బ్యాంకులో వేశామని సచివాలయ సిబ్బంది తెలిపారు. గ్రామంలో బ్యాంకు లేకపోవడంతో 7 కి.మీ దూరంలోని సి.బెళగల్ కెనరా బ్యాంకుకు వెళ్లాను. ఆరోగ్యం సహకరించరించడం లేదు. ఎండలోనే అంత దూరం వెళ్లి గంటల తరబడి ఎదురు చూసి నగదు తీసుకున్నాను. గతంలో వలంటీర్ ఇంటి దగ్గరకు వచ్చి ఇచ్చేవాడు. రాజకీయ కక్షలతో మాలాంటి వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదు.

–పెద్దక్క, వృద్ధాప్య పింఛన్‌దారు, గొల్లలదొడ్డి, సి.బెళగల్

బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ కాలేదని..



గూడూరు మండలం మునుగాల గ్రామానికి చెందిన మిన్నెల్ల వృద్ధాప్య పింఛన్ తీసుకోవడానికి గూడూరు ఎస్‌బీఐకు వెళితే బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ కాలేదని బ్యాంక్ సిబ్బంది నగదు ఇవ్వలేదు. పింఛన్ డబ్బులు వస్తేగాని పూట గడవదని ఎంతో దీనంగా ఆ వృద్ధుడు బ్యాంక్ సిబ్బందితో మొర పెట్టుకోగా రేపు రాపో అని తిప్పి పంపారు.

–మిన్నెల్ల, మునుగాల

టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ కష్టాలే

- చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మొద్దు
- అవ్వాతాతలను ఇబ్బందులకు గురిచేయడం కళ్లారా చూశాం
- ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే
- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


గడివేములలో కాటసానికి ఘన స్వాగతం పలుకుతున్న స్థానికులు


బూజునూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి ఓటు వేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బూజునూరు, గడిగరేవుల, తిరుపాడు, చిందుకూరు, గడివేములలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నేతలు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మొద్దన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకోవాలన్నారు. సమాజంలో మహిళలు ఆర్థికంగా, సమాజికంగా ఎదగాలంటే జగనన్నతోనే సాధ్యమన్నారు. టీడీపీకి ఓటు వేస్తే జగనన్న తెచ్చిన పథకాలన్నీ దూరం అవుతాయని తెలిపారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రైతుల కోసం ఎన్ని సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాలు అందించారని తెలిపారు. గ్రామాల్లోనే అధికారుల సలహాలు, పంటలను అమ్ముకునేందుకు రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చారని తెలిపారు. నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ 99 శాతం అమలు చేశారన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

తనపై టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హితవు పలికారు. వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణ చేసి ఓర్వలేక ఆ పార్టీ నాయకులు బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. వారిని ప్రజలు కూడా నమ్మడం లేదన్నారు. గత ఎన్నికల్లోనే కోలుకోలేని గుణపాఠం చెప్పినా వారిలో మార్పు రాలేదన్నారు. ఈ ఎన్నికల్లో కొట్టే దెబ్బతో అడ్రస్ లేకుండా పోతారన్నారు.

బాబు వల్లే వృద్ధులకు కష్టాలు

ఇంటి వద్దే పింఛన్లు అందించే వలంటీర్లపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి వారిని పింఛన్ల పంపిణీకి దూరం చేశారని విమర్శించారు. దీంతో వృద్ధులు సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పాపం ముమ్మాటికీ చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో వృద్ధుల సత్తా ఏంటో చూపించాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేస్తా

తనను మరోసారి గెలిపిస్తే అలగనూరు రిజర్వాయర్‌ను మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. గ్రంధివేముల గ్రామంలో శ్మశానం ఏర్పాటు చేస్తానన్నారు. అర్హత ఉన్న వారందరికీ ఇంటి పట్టాలు ఇప్పిస్తానని తెలిపారు. ఎస్‌ఆర్‌బీసీలో నిరుపేదలకు ఇంటి పట్టాలు రాకుండా టీడీపీ నాయకులే అడ్డుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి, నాయకులు మధుసూదనగుప్తా, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, సీపీ రమణయ్య, ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, ఆనందర్‌రెడ్డి, రఘుమాధవరెడ్డి, రామ కృష్ణారెడ్డి, దస్తగిరిరెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి, మేఘనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను నిలబెట్టుకుందాం


వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, నాయకులకు ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, సతీష్

సి.బెళగల్: సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, మణిగాంధీ అన్నారు. శుక్రవారం సాయంత్రం సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన నాయకులకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు, అన్ని వర్గాలకు మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలన్నా ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలన్నారు. టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి వెంట గూండాలు, రౌడీలు ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు పల్లెల్లో అల్లర్లు సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కిన విషయాన్ని మరిచిపోవద్దని సూచించారు. మరోసారి ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నారని.. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఎంపీపీ బొంతల మునెప్ప, పార్టీ మండల అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, నాయకులు నరసింహుడు, సంధ్యా విక్రమ్‌కుమార్, సీబీ తులసిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చిన్నకొండయ్య, ఎస్ఎం బాషా, సీబీ గోవింద రెడ్డి, మహానంది, మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, పులిరాజు, హరున్‌రషీద్, మనోహరయ్య, సోముడు, రాజేష్, నాగేష్ పాల్గొన్నారు.


మహిళలకు పథకాల గురించి వివరిస్తున్న ఆదిమూలపు సతీష్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

కూటమిని నమ్మితే మోసపోతారు

కర్నూలు సిటీ: 2014 ఎన్నికల్లో మాదిరిగానే చంద్రబాబు నాయుడు జత కట్టిన కూటమిని నమ్మితే మోసపోతారని, గతంలో వారు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆదిమూలపు సతీష్, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబునాయుడు పేరు చెబితే పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి విషయం ప్రజలకు గుర్తుకు వస్తుందన్నారు. ఇప్పుడు అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని, ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

పింఛన్‌దారుల ఉసురు తప్పదు

ప్రతి నెలా 1వ తేదీ ఇంటికే వలంటీర్లు వెళ్లి పింఛన్ ఇచ్చేవారని, అది చూసి తట్టుకోలేక చంద్రబాబు అడ్డంకులు సృష్టించారని సతీష్ అన్నారు. దీంతో రెండు నెలల నుంచి సకాలంలో పింఛను అందుకోలేక వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పల్లెల్లో మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహెమియా, డి.వాసు, సర్పంచ్ బోయ శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ హామీలు నమ్మి మోసపోవద్దు

కల్లూరు: అమలు సాధ్యం కాని హామీలతో టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివ నరసింహారెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తనయుడు పోచా జనార్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం కల్లూరు మండలం ఎ.గోకులపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకే దక్కుతుందన్నారు. నవరత్నాలు, ఇతర పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మరోసారి పట్టం కట్టాలని కోరారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానంద్దారెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఉప సర్పంచ్ రహీమ్, అభి, స్వాములు పాల్గొన్నారు.


ఓటు వేయాలని వృద్ధుడిని కోరుతున్న శివ నరసింహారెడ్డి

14 మంది రాజీనామా

కర్నూలు సిటీ: మండల పరిధిలోని బి.తాండ్రపాడు, పంచలింగాల, ఈ.తాండ్రపాడు గ్రామాలకు చెందిన 14 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. కర్నూలు ఎంపీడీఓ నరసింహనాయుడుకు అందుకు సంబంధించిన లేఖలు అందజేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజలకు సేవలు అందిస్తున్న తమను కొన్ని రాజకీయ పార్టీల నాయకులు అవమానపరిచేలా మాట్లడటం సరికాదని ఈసందర్భంగా వారు పేర్కొన్నారు.

బ్యాంకు మేనేజర్ ఔదార్యం

కోడుమూరు రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల పింఛన్‌ను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. దీంతో రెండు రోజుల నుంచి లబ్ధిదారులు పింఛన్ నగదు కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను చూసిన కోడుమూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ సుదర్శన్ బ్యాంకు ఆవరణలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. టెంట్ వేసి నీడ సౌకర్యం కల్పించడంతో పాటు, కుర్చీలు, మంచినీటి వసతి కల్పించారు. దీంతో బ్యాంకులో గంటల తరబడి నిలబడాల్సిన అవసరం లేకుండా లబ్ధిదారులు నగదు తీసుకుని వెళుతున్నారు. మేనేజర్ చొరవను మెచ్చుకుంటున్నారు.


ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో నగదు తీసుకుంటున్న పింఛన్‌దారులు

జగనన్నతోనే సంక్షేమం


గూడూరులో ప్రచారం చేస్తున్న స్టెల్లా సతీష్

గూడూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ భార్య స్టెల్లా అన్నారు. శుక్రవారం గూడూరు దళితవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జగనన్న మరోసారి సీఎం అయితేనే దళితులు, బడుగు, బలహీనవర్గాల వారు బాగుంటారని తెలిపారు. ఆమె ప్రచారానికి స్థానికుల నుంచి మంచి స్పందన వచ్చింది. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎన్ అస్లామ్, బోయ లక్ష్మన్న, పార్టీ నాయకులు జె.ఆబేల్, ఎల్.వెంకటేశ్వర్లు, దస్తగిరి, కలామ్, బజారి, షేక్‌షావలి, టీచర్ కిషోర్, కుమార్, మద్ది, పత్తి రంగడు, సత్యాలు, టీఎస్ రాజు, శ్రీకాంత్ గౌడ్, మల్లి, దేవరాజు, ఉగ్ర తదితరులు పాల్గొన్నారు.